క్లుప్తంగా

వినాయక చవితి శుభాకాంక్షలు


ఎమ్మెల్సీ విక్రాంత్


మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ/వీరఘట్టం: వినాయక చవితి పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా సంబరంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆకాంక్షించారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. ఏడాది విఘ్నాలు తొలగి ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఆనందంగా తొలి పూజ గణేష్ మహోత్సవాలు జరుపుకోవాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోండి


పెదబుడ్డిడిలో గ్రామస్తుతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

జియ్యమ్మవలస రూరల్: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండగ చేసుకోవాలని ఎస్ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ సూచించారు. మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన గణేశుని నవ రాత్రి ఉత్సవాలకు గ్రామస్తులు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పూజ, ఊరేగింపు సమయాల్లో ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎల్విన్‌పేట సీఐ బి.హరి మంగళవారం పర్యటించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సరదాగా గణపతి ఉత్సవాలు జరుపుకోవాలని గ్రామస్తులను కోరారు.

పిల్లల పరిరక్షణకు సంక్షేమ కమిటీలు


మాట్లాడుతున్న సీడీపీవో సిమ్మాలమ్మ

సీతంపేట: గ్రామాల్లో పిల్లల పరిరక్షణకు సంక్షేమ కమిటీలు ఎంతో దోహదపడతాయని సీడీపీవో సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని జామితోట గ్రామంలో సంక్షేమ కమిటీల విధులు, బాధ్యతలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైన్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న అధికారులంతా సమన్వయంతో పిల్లలను పరిరక్షించుకోవాలన్నారు. బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాలపై వివరించాలన్నారు. బాలల హక్కుల గుర్చి తెలియజేయాలన్నారు. గ్రామ స్థాయిలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. లైంగిక దాడి జరిగితే శిక్ష తప్పదని వివరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, వీఆర్‌వోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాదు.. పాఠశాల ప్రాంగణం



ఈ చిత్రంలో పాఠశాల ముందు కనిపిస్తున్నది చెరువు అనుకుంటే పొరబడినట్టే. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొత్త పనుకువలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మొత్తం 1 నుంచి 5 తరగతుల్లో 27 మంది చదువుతున్నారు. వర్షం పడితే ఇక్కడ నీరు నిల్వ ఉండడంతో నీటిని దాటుకుంటూ రావాలంటే విద్యార్థులకు కష్టంగా ఉంది.

-సీతంపేట

సన్మానం


లాత్వికను అభినందిస్తున్న సరస్వతి విద్యానికేతన్ సిబ్బంది

కురుపాం: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని కాదా లాత్విక తొలి ప్రయత్నంలో నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, గుంటూరు కాటూరి మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించారు. ఈ మేరకు సరస్వతి విద్యానికేతన్ విద్యాసంస్థ యాజమాన్యం లాత్వికను మంగళవారం సన్మానించి, అభినందించారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థి ఉచితంగా ఎంబీబీఎస్ సీటు సాధించడం తమకు గర్వకారణంగా ఉందని యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తినాయుడు, కరస్పాండెంట్‌లు నెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సింగిడి నుంచి ఆటోలో విగ్రహాన్ని తరలిస్తున్న యువత


వీరఘట్టం: సిద్ధం చేసిన గణపతి లడ్డూప్రసాదం


వీరఘట్టం: చలివేంద్రికి తరలిస్తున్న గణేశుని విగ్రహాలు


గరుగుబిల్లి: పెద్దూరులో సిద్ధం చేసిన గణేశుని మండపం



పాలకొండ రూరల్: మట్టి విగ్రహాలతో అట్టలి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

తొలిపూజకు సిద్ధం..

వినాయక చవితికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ఉత్సవాలు ఆరంభం కానుండడంతో తొలిపూజకు అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే ముస్తాబు చేసిన మండపాలకు గణేశుని విగ్రహాలు తరలించారు. మామిడితోరణాలు, రంగురంగుల జెండాల అలంకరణలో విద్యుత్‌కాంతుల నడుమ రూపుదిద్దుకున్న మండపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే పూజా ప్రాంగణాల్లోని మైక్‌సెట్‌ల ద్వారా వస్తున్న గణేశుని పాటలతో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం జరిగే పూజకు ఎటువంటి విఘ్నాలు తలెత్తకుండా ఉత్సవ కమిటీలు పకడ్బందీగా చర్యలు చేపట్టాయి.

-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్


వీరఘట్టంలోని ముచ్చర్లవీధిలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన వినాయక మండపం


గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి తరలిస్తున్న వినాయకుడి విగ్రహం


వీరఘట్టం: నీలానగరంలో మట్టి విగ్రహాలే వాడాలని అవగాహన ర్యాలీ


పాలకొండ: మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ ప్రయోగమూర్తి


పాలకొండ రూరల్: మండపానికి తరలిస్తున్న గణనాథుడి భారీ విగ్రహం

యూరియా ఇవ్వకపోతే పంటలు ఎలా పండిస్తారు?

- మండల సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు


అధికారుల తీరుపై మండిపడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: వ్యవసాయానికి అవసరమైన యూరియాను రైతులకు అందివ్వకపోతే వారు ఎలా పంటలు పండిస్తారని ఎంపీపీ ఉరిటి రామారావు సహా పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. పలువురు సభ్యులు తమ పరిధిలోని ప్రజాసమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారంలో ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో యూరియా కొరత, ఒక రైతుకు ఒక యూరియా బస్తా అందివ్వడం వంటి అంశాలపై ఎంపీపీ సహా పలువురు సభ్యులు వ్యవసాయాధికారిణి తేజశ్వినిని నిలదీశారు. ఖరీఫ్ సాగు సమయానికి ఎన్ని ఎకరాల మేర వరి సాగు జరుగుతోంది..ఎంత యూరియా అవసరం అనే విషయాలు తెలియవా? దానికి తగ్గట్టుగా ఇండెంట్ పెట్టి యూరియా ఎందుకు తీసుకురాలేదు అని అడిగారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో సక్రమంగా సరఫరా చేయకపోవడంతోనే ప్రైవేటు ఎరువుల షాపులను సంప్రదించాల్సి వస్తోందని మండిపడ్డారు. ఒక రైతుకు ఒక బస్తా యూరియా ఇస్తే ఐదెకరాలు సాగు చేస్తున్న రైతు మిగతా యూరియాను ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి ఇబ్బంది లేదన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు కేవలం క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులనే బాధ్యులను చేయడం సరికాదని ఉపాధి అధికారులను అడిగారు. ఆ శాఖ ఉన్నతాధికారుల హస్తం లేకుండా అక్రమాలు సాధ్యమవుతాయా అన్నారు. ఉపాధి పథకంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని పట్టుబట్టారు.

శిథిలావస్థలో ఉన్నా చర్యలు శూన్యం..

శివ్వాం పంచాయతీలోని సీమలవానివలస, చిలకాం పంచాయితీలోని కారివలస గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నా ఇప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రాణనష్టం జరిగితే గానీ స్పందించరా అని ధ్వజమెత్తారు. తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసిత గ్రామం సుంకి గ్రామస్తుల పునరావాసం కోసం కేటాయించిన స్థలంలో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తే గృహ నిర్మాణాలు ప్రారంభించడం జరుగుతుందని సర్పంచ్ కె.రవీంద్ర అన్నారు.

నాగూరు పశువైద్య శాల కూలిపోయే దశకు చేరుకుందని, తక్షణమే కొత్త భవనం నిర్మించాలని ఎంపీటీసీ ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కోరారు. సమావేశంలో తహసీల్దారు పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ సాగుపై అవగాహన

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయంలో డ్రమ్ సీడర్‌తో సాగు చేయడం రైతుకు ఎంతో లాభదాయకమని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం టెక్నికల్ టీమ్ హెడ్ దేవుళ్లు రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంగమ్మపేట గిరిజన గ్రామంలో గిరిజనులకు డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. గట్లుపై కంది సాగుకు అనుగుణంగా రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం టీమ్ సభ్యులు జి.హేమసుందర్, సి.ప్రకాష్, ఎం.శ్రావణ్‌కుమార్, వీరఘట్టం ఏవో జె.సౌజన్య, యాంకర్ పర్సన్ సింహాచలం పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి


ప్రజలు సూచనలు చేస్తున్న డీపీవో కొండలరావు

గరుగుబిల్లి: పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని, అనవసరంగా కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు కోరారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో మంగళవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణకు వస్తున్న గ్రీన్ అంబాసిడర్‌కు తడి,పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అలా అయితేనే మన ఆరోగ్యం, సమాజ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. నిషేధిత పాలిథిన్ సంచులు వినియోగించవద్దని, గుడ్డసంచులు వాడాలని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరుపై సభ్యుల ధ్వజం


సమావేశంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న సభ్యులు

పాలకొండ: నగర పంచాయతీలో కొంత మంది సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై పాలకవర్గ సభ్యులు ధ్వజమెత్తారు. మంగళవారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుపై కమిషనర్‌ను ప్రశ్నించారు. 14 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని తీర్మానం చేశామని ఇందులో కేవలం ఒక్కరికి మాత్రమే వేతనం పెంచి మిగతా వారికి ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పనితీరు సక్రమంగా లేదని ఆరోపించారు. వెంటనే ఆయనను ఇక్కడ నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఇచ్చిన అనుమతులు ఎందుకు అమలు చేయలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. సభ్యులు చేసిన తీర్మానాలు అమలు చేయకుండా సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ రత్నంరాజు, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, సభ్యులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమానత్వ సాధనపై అవగాహన


మహిళా సమానత్వంపై అవగాహన కల్పిస్తున్న జయమణి

పాలకొండ రూరల్: సమాజంలో మహిళల సమానత్వ సాధనపై మరింత లోతైన అవగాహన విద్యార్థి స్థాయిలో అలవర్చుకోవాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి అన్నారు. నేషనల్ ఉమెన్ ఈక్వల్ డే సందర్భంగా మంగళవారం కళాశాలలో విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2లకు, సహ విద్యార్థినిలకు మహిళలకు ఓటు హక్కును కల్పించిన రాజ్యాంగ సవరణ ఆర్టికల్ – 19 గురించి వివరించారు. సమానత్వ సాధన కోసం జరిగిన పోరాటాలను వివరించారు. భవిష్యత్తులో లింగ వివక్షను సమాజం నుంచి దూరం చేసే దిశగా చైతన్యం పొందాలన్నారు. అన్ని రంగాల్లో మహిళా శక్తిని చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, అర్థ, గణిత, వాణిజ్య, రసాయన శాస్త్ర విభాగాధిపతులు ఎం.శాంతి, రాఘవేంద్రనాయుడు, పల్లా రాజ్యలక్ష్మి, ఆమంచి శ్రీనివాసరావు, ఎస్.జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వరితెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


కొండలేవిడి గ్రామంలో వరిసాగులో తెగుళ్లను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కురుపాం: వరితెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంతవిహారి, ఎస్.ప్రవంతిలు సూచించారు. మండలంలోని కొండలేవిడి గ్రామాన్ని మంగళవారం సందర్శించిన వారు..అక్కడి రైతులు సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. వరిలో ఆకుముడత తెగుళ్లు, రైస్‌హార్న్ కేటర్ పిల్లర్ పురుగు పట్టడాన్ని గుర్తించారు. అనంతరం ఆయా తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.

నీట మునిగిన పంట పొలాలు



నీట మునిగిన వరి పంట పొలాలు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో పాటు ముసురు కొనసాగుతుండటంతో లోతట్టు పంట భూముల్లో వర్షపు నీరు భారీగా చేరింది. ఈ క్రమంలో నాట్లు వేసి ఉన్న పంట భూములు చెరువులను తలపిస్తున్నాయి. మూడు రోజులుగా ఇదే స్థితి కొనసాగటంతో నారు కుళ్లిపోయే ప్రమాదం ఉందని బాధిత ప్రాంత రైతులు వాపోతున్నారు. ఇటీవల సాగునీటికి అవస్థలు పడ్డ రైతులు ప్రస్తుతం వరుణిడి ప్రకోపానికి ఇబ్బందులు పడుతున్నారు, మండలంలోని భాసూరు, రాజుపేట, వీరఘట్టం రహదారితో పాటు తుమరాడ వెళ్లే మార్గానికి ఇరువైపులా వర్షపు నీరు పొలాల్లో దర్శనిమిస్తుంది. ఈ ప్రాంత రైతులు తమ భూముల నుంచి నీటిని బయటకు మళ్లించే మార్గాలపై దృష్టి పెట్టారు. వ్యవసాయ శాఖ ఏడీ కె.రత్నకుమారి మాట్లాడుతూ నీరు మళ్లించే ఏర్పాట్లు చేయటంతో పాటు అధికారులు సూచనలు పాటించాలన్నారు. మండల పరిధిలో రెండు రోజుల వ్యవధిలో 16.02 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

నదీతీరాలకు వెళ్లొద్దు..

గుమ్మలక్ష్మీపురం: తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలెవరూ నదీతీరాలకు వెళ్లవద్దని తహసీల్దారు ఎస్.శేఖర్ ఓ ప్రకటనలో మంగళవారం సూచించారు. వర్షాలు తగ్గినంత వరకు ఇంటి వద్దనే ఉండాలని, బయట ఉండే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు.

కొట్టుకుపోయిన కాలువ



సీతంపేట: భారీగా కురుస్తున్న వర్షాలకు చిన్నబగ్గ కాలనీ పరిధిలో పంట కాలువ కొట్టుకుపోయింది. నీరు పొలాలకు వెళ్లాల్సింది పోయి వేరే గెడ్డలోకి పోతుంది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. దీని పరిధిలో సుమారు 25 హెక్టార్ల వరకు వరి పంట పండుతోంది. వర్షాధారంపై ఆధారపడి ఇక్కడ పంటలు పండిస్తారు. పొలాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా గెడ్డలోకి వెళ్లిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు.

కాలనీలో కష్టాలు


గారమ్మ కాలనీలో నిలిచిన మురుగు, వర్షపునీరు

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో నేటికి పలు రోడ్లు చినుకుపడితే చాలు చిత్తడిగా మారటంతో పాటు వర్షపు నీరు కాలువలకు బదులుగా రోడ్లపై పారుతుంది. పట్టణంలో వీధి కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో పాటు రోడ్లు వేయక పోవటంతో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. స్థానిక గారమ్మ కాలనీలో డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు లేక మురుగు, వర్షపు నీరు వీధుల్లో నిలిచి పోయింది. మంగళవారం అక్కడి సమస్యలను ప్రజలు ఏకరువు పెట్టారు. గత కొద్ది రోజులుగా తమ ప్రాంతలో తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, అస్తవ్యస్థమైన కాలువల తీరుపై అధికారుల దృష్టికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవటం పట్ల విమర్శలు వస్తున్నాయి. వర్షం పడితే ఇళ్ల నుంచి బయటకు రాలేని స్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. దోమలు, విష కీటకాలు, పాముల బెడద అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో రోగులకు వైద్యసేవలు అందించాలి


రోగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎన్‌సీడీపీవో జగన్మోహనరావు

కొమరాడ: సకాలంలో రోగులకు వైద్యసేవలు అందించాలని జిల్లా ఎన్‌సీడీపీవో డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని కోటిపాం, గంగారేగువలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య సిబ్బందికి తెలిపారు. ఎవరైనా జ్వరపీడితులు ఉంటే వారు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందేలా చూడాలన్నారు.

గిరిజన పథకాలపై అవగాహన

భామిని: గిరిజనులకు నీతి ఆయోగ్ సంస్థ ప్రతిపాదిత ఆశావహ కార్యక్రమాల్లో మంజూరైన పథకాలు పూర్తిగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు మనుమకొండలో సర్పంచ్ నిమ్మల కేశవ అధ్యక్షతన మంగళవారం వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అధికారులు, గిరిజనులతో చర్చించారు. ఏపీటీఏసీ సభ్యులు నిమ్మల కోరా, ఈవోపీఆర్‌డీ కృష్ణారావు, ఉపాధి ఏపీవో బాబూరావు, మహేష్‌కుమార్, ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

పాలకొండ రూరల్: పంట రుణాలు తీసుకున్న, తీసుకోదలచిన రైతులు తప్పక వారు సాగు చేస్తున్న పంటలకు బీమాతో పాటు ఈకేవైసీ చేయించాలని మండలంలోని ఆర్‌బీఆర్ పేట వ్యవసాయ పరపతి సంఘం ఇన్‌చార్జ్ వై.మోహనరావు అన్నారు. మంగళవారం సదరు పీఏసీఎస్ పరిధిలో రైతులకు సీఈవో బి.సత్యంనాయుడు నేతృత్వంలో అవగాహన కల్పించారు.

వాతావరణ స్థితిగతులు, పర్యావరణ సమతుల్యత లోపించటం వలన పంటలు నష్టపోతే పరిహారం పొందవచ్చన్నారు.

ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి : సబ్ కలెక్టర్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

పాలకొండ: డివిజన్‌లో వినియక చవితి ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు తొలి పూజగా కొలిచే వినాయక చవితి ఎటువంటి అపశృతి లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు మండపాలను పరిశీలించి సూచనలు అందించాలని తెలిపారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా పర్యవేక్షణ చేయాలని డీఎస్పీ రాంబాబుకు ఆదేశించారు. ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరిపించేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక నిమజ్జన సమయంలో ఒకే సారి రెండు, మూడు వినాయక విగ్రహాలు వెళ్లకుండా అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు.